ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

మంగళవారం 14 మే 2024

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0 | కనిష్ఠం : 27.0



పెబ్బేరులో పోలింగ్ బూత్ వద్ద ఓటర్లతో కలిసి వేలిపై సిరా చుక్కను చూపుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాలకు మొత్తం 50 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. రెండు పార్లమెంట్‌ల పరిధిలో పోలింగ్ శాతం గతం కంటే ఎక్కువగా నమోదైంది. గతానికి భిన్నంగా ఈ సారి ఎంపీ ఎన్నికల్లో వలస ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దాంతో పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలోని ఎదిర గ్రామస్థులు అమర్‌రాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటును నిరసిస్తూ ఎన్నికలను బహిష్కరించారు.



రేవల్లి మండలంలోని జయన్న తిరుమలాపూర్‌లో ఓటు వేసి సిరాచుక్క చూపుతున్న చిన్నారెడ్డి



ఓటు వేసి సిరాచుక్క చూపుతున్న శివసేనారెడ్డి



పెద్దమందడి: మంగంపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



వనపర్తి పట్టణంలో ఓటు హక్కు వినియోగించుకున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



వనపర్తిలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



పెబ్బేరులో పోలింగ్ బూతులను పరిశీలించడానికి వస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పోటెత్తిన ఓటరు





వనపర్తి రాజనగరం ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రం బయట ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు

- పాలమూరులో 72శాతం, నాగర్‌ర్నూల్‌లో 69.01శాతం పోలింగ్
- 2019 ఎన్నికలతో పోల్చితే భారీగా పెరిగిన ఓటింగ్
- చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతం

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని సెగ్మెంట్ల వారీగా పోలింగ్ శాతం

స్థానం	శాతం
నాగర్‌కర్నూల్	63.56
వనపర్తి	66.56
జోగుళాంబ గద్వాల	74.93
అలంపూర్	73.11
కల్వకుర్తి	72.51
కొల్లాపూర్	64.00
అచ్చంపేట	64.88
మొత్తం	69.01

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని సెగ్మెంట్ల వారీగా పోలింగ్ శాతం

స్థానం	శాతం
కొడంగల్	71.5
షాద్‌నగర్	77.42
దేవరకద్ర	73.47
జడ్చర్ల	76.70
మహబూబ్‌నగర్	65.35
మక్తల్	70.85
నారాయణపేట	68.71
మొత్తం	72.00

మహబూబ్‌నగర్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. చెదురుమదురు ఘటనలు, పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు.. రెండు చోట్ల ఓట్ల బహిష్కరణ మినహా మిగతా చోట్ల పోలింగ్ ఆటంకాలు లేకుండా పూర్తయ్యింది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాల పరిధిలో ఏడేసి నియోజకవర్గాలు ఉండగా.. అన్నిచోట్లా మూడు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీ పోరు సాగింది. ముందు నుంచీ ఈ రెండు స్థానాల్లో గెలుపును సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. బీజేపీ కూడా ఈ ఎన్నికల్లో గెలవడం ద్వారా రేవంత్‌రెడ్డిని సొంత జిల్లాలో దెబ్బతీసినట్లు అవుతుందని భావించడం, గతంలో కంటే పెరిగిన యువ ఓటర్లపై ఆశలు పెట్టుకోవడం వంటి అంశాలతో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. వేకువజామున కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడటం కూడా ఓటింగ్ పెరగడానికి ఒక విధంగా కలిసి వచ్చిందని చెప్పొచ్చు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. మొదట్లో మందకొడిగా సాగిన పోలింగ్.. తొమ్మిది గంటల నుంచి అంతకంతకూ పెరుగుతూ పోయింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంలో ఉదయం తొమ్మిది గంటలకు 10.33 శాతం పోలింగ్ నమోదు కాగా.. 11 గంటల సమయానికి 26.99 శాతానికి పెరిగింది. ఒంటి గంటకు 45.84 శాతం నమోదు కాగా.. మూడు గంటలకు 58.92, సాయంత్రం ఐదు గంటల వరకు 68.40 శాతం నమోదైంది. పోలింగ్ సమయం ఆరు గంటల వరకు ఉండగా, ఆ సమయం వరకు కేంద్రాల్లోకి వచ్చిన వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఆరు దాటిన తర్వాత కూడా ఓటర్లు క్యూలైన్లో ఉండటంతో ఓటింగ్ పూర్తయ్యే సమయానికి 72 శాతం పోలింగ్ నమోదైంది. అమర్ రాజా బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఎదిర నాలుగో వార్డులో పోలింగ్‌ను బహిష్కరించారు. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం మైలారంలో మైనింగ్‌కు వ్యతిరేకంగా ఓటు వేయలేదు. పదర మండలం వట్టువర్లపల్లిలో ఓటు వేయడానికి ప్రజలు కొంతసేపు నిరాకరించినప్పటికీ.. ఆ తర్వాత వివాదం సద్దుమణిగి ఓటు వేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పైపాడు పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ సింబల్ కారుపై ఇంకుతో కనిపించకుండా చేశారనే వివాదం నెలకొంది. గొడవలు జరగకుండా పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. కోస్గి మండలంలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణ.. పోలింగ్ కేంద్రంలోకి కండువాతో వెళ్లారని సీ విజిల్‌లో ఫిర్యాదు నమోదైంది. వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలో ఒక వ్యక్తి డబ్బులు పంచుతున్నారనే కారణంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్పీ రక్షిత కె.మూర్తి



వనపర్తి పట్టణంలో ఓటు వేసిన హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున

గతం కంటే పెరిగిన పోలింగ్

2019 పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే.. ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం అత్యధికంగా నమోదైంది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 2019లో 65.39 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 72 శాతం పోలింగ్ నమోదైంది. 6.61 శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి.. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి వచ్చిన 2014 పోలింగ్ శాతం కూడా ఇంచుమించుగా ఇదే విధంగా నమోదైంది. 2014లో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 72.94 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పార్లమెంట్ పరిధిలో 16,82,470 ఓట్లు ఉండగా.. 72 శాతం పోలింగ్ నమోదై.. 12,11,378 ఓట్లు పోలయ్యాయి. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 2019 ఎన్నికల్లో 62.23 శాతం పోలింగ్ నమోదు కాగా.. ఈ ఎన్నికల్లో 69.01 శాతం నమోదైంది. గతంలో కంటే 6.78 శాతం పోలింగ్ పెరిగింది. 2014 కంటే కొంత తక్కువ నమోదైందని చెప్పవచ్చు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 17,34,773 మంది ఓటర్లు ఉండగా.. 11,97,166 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు పార్లమెంట్‌ల పరిధిలో కలిపి 34,17,243 మంది ఓట్లు ఉండగా.. 24,08,544 మంది ఓటు వేశారు. దాదాపు 10.08 లక్షల మంది ఓటు హక్కును వినియోగించుకోలేదు.



మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీలో బారులు తీరిన ఓటర్లు



మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలోని బోయపల్లి కేంద్రంలో మహిళా ఓటర్లు



మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలోని అయ్యవారిపల్లిలో బారులు తీరిన ఓటర్లు



పోలింగ్ ముగిశాక పాలమూరులోని స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకెళ్తున్న ఈవీఎంలు

స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు

పోలింగ్ పూర్తయిన వెంటనే నాగర్‌కర్నూల్‌కు సంబంధించిన ఈవీఎం మిషన్లను ఆ జిల్లా కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాంకు తరలించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను పాలమూరు యూనివర్సిటీకి తరలించారు. ఆయా జిల్లాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు ఈవీఎం స్ట్రాంగ్ రూంలను పరిశీలించి.. డిపాజిట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. స్ట్రాంగ్ రూంల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు.

ఓటర్లపై తేనెటీగల దాడి



వటువర్లపల్లిలో ఆరోగ్య కేంద్రంలో బాధితులు

దోమలపెంట: నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వటువర్లపల్లిలో సోమవారం ఓటు వేసేందుకు వెళ్తున్న గ్రామస్థులపై తేనెటీగలు దాడి చేశాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామంలోని పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో ఒక చెట్టుకు తేనె తుట్టె ఉంది. ఆ తేనె తుట్టెను ఆకయితాలు రాయితో కొట్టారు. దాంతో తేనెటీగలు గ్రామంలోకి వచ్చి, గ్రామస్థులపై దాడి చేశాయి. తప్పించుకోడానికి ప్రజలు పరుగులు తీశారు. 30 మందిపై దాడి చేయగా.. కొర్ర తిరుపతి, వర్త్యావత్ గణేష్, వర్త్యావత్, మౌనిక, కరంటోత్ సింధు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారికి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారితో పాటు రాజు, ప్రవీణ్, సాయిబాబు, బాలరాజు, మల్లయ్య, రాజేష్, జైపాల్, సూర్యం, శివ, మల్లేష్ చికిత్స పొందారు.

పోలింగ్ కేంద్రం వద్ద మహిళకు మూర్ఛ



మూర్ఛ వచ్చిన మహిళకు సపర్యలు చేస్తున్న పోలీసు

తాడూరు: నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఇంద్రకల్ గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం ఓటు వేయడానికి వచ్చిన మహిళకు మూర్ఛ వచ్చింది. ఆమె కింద పడుతుండగా కానిస్టేబుల్ పట్టుకున్నారు. ఆమె చేతిలో తాళం చెవులు పెట్టారు. ఏఎన్ఎం మహిళ ముఖంపై నీళ్లు చల్లి, మాత్ర వేయడంతో ఆమె కోలుకున్నారు.

గద్వాల చీరలు ధరించిన సిబ్బంది



గద్వాల పోలింగ్ కేంద్రంలో చేనేత జరీ చీరలు ధరించి విధుల్లో పాల్గొన్న సిబ్బంది

గద్వాల న్యూ టౌన్: జోగుళాంబ గద్వాల పురపాలిక పరిధిలోని జమ్మిచేడు గ్రామంలోని, అలంపూర్‌లోని మహిళా పోలింగ్ కేంద్రాల్లో నలుగురు చొప్పున మహిళా సిబ్బంది గద్వాల చేనేత జరీ చీరలు ధరించి, విధుల నిర్వర్తించారు. స్వీప్(సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిస్పేషన్) కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా నేసిన ఆ చీరలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్ వారికి అందజేశారు. చీరల కొంగులపై హెచ్‌వోపీ(హౌస్ ఆఫ్ పార్లమెంట్) ఎలక్షన్ 2024, జోగుళాంబ గద్వాల జిల్లా అని రాసి ఉంది. ఈ చీరలు మహిళా ఓటర్లను ఆకట్టుకున్నాయి.

పోలింగ్ ప్రశాంతం

వనపర్తి క్రైం, మే13: జిల్లావ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓటర్లు ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. ఒక్కసారిగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తడంతో పలు పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎండ తీవ్రత పెరగడంతో 11 గంటల నుంచే మూడు గంటల మధ్య సమయంలో పోలింగ్ కేంద్రాలు ఓటర్లు లేక బోసి పోయాయి. వనపర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉదయం 11 గంటల వరకు 29.46 శాతం, మధ్యాహ్నం ఒంటి గంట వరకు 46.28 శాతం, మధ్యాహ్నం మూడు గంటల వరకు 56.19 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 63.79 శాతం పోలింగ్ నమోదయింది. ఓటింగ్ ముగిసే వరకు 66.56శాతం నమోదైంది. పెబ్బేరు పట్టణంలో 200 పోలింగ్ బూత్ కేంద్రంలో పోలింగ్ మొదలైనప్పటి నుంచే పది నిమిషాల పాటు వీవీ ప్యాట్ల స్లిప్పులు రాకపోవడంతో వెంటనే అధికారులు సరి చేశారు. అదే విధంగా వనపర్తి జిల్లా కేంద్రంలోని ఇందిరా కాలనీలో 104 పోలింగ్ బూత్‌లో ఉదయం 10 తరువాత ఈవీఎం మొరాయించడంతో వెంటనే అధికారులు సరి చేశారు. అదే విధంగా ఘణపూర్ మండలంలోని పర్వతాపూర్‌లో పోలింగ్ చివరి పది నిమిషాల ముందు ఈవీఎంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వెంటనే అధికారులు సరి చేశారు. అమరచింత మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్ 228లో మధ్యాహ్నం ఒంటి గంటకు ఈవీఎం మొరాయించడంతో దాదాపు రెండు గంటల తరువాత అధికారులు కొత్త మిషన్ తెచ్చి ఓటింగ్ ప్రారంభించారు. చిన్నంబావి మండలంలోని వెల్టూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రకాష్ అనే వ్యక్తి డబ్బులు పంపిణీ చేస్తుండగా ఇతర పార్టీల నాయకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి చేరుకుని అతని వద్ద రూ.50వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పబ్బతి రమేష్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలు సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను ఎస్పీ రక్షిత కెమూర్తి పరిశీలించారు. కొత్తకోట మండల పరిధిలోని జడ్పీహెచ్ఎస్, మదనాపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్, పెద్దమందడి మండలంలోని మోజర్లలోని , ఘణపురం మండలంలోని సోలీపూర్, జిల్లా కేంద్రంలోని బాలికల హై స్కూల్ పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలిచారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ స్వంత గ్రామమైన గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమలాపురంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, పెద్దమందడి మండల పరిధిలోని మంగంపల్లిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాలలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మర్రికుంటలోని పోలింగ్ కేంద్రంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ రక్షిత కెమూర్తి, వనపర్తి మండలంలోని పెద్దగూడెంలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాజ్యాంగ విలువలు కాపాడాలి

- కాంగ్రెస్ అభ్యర్థి చల్లావంశీచంద్‌రెడ్డి

రాజ్యాంగ విలువలు కాపాడేందుకు ప్రతీ ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఓటు వేసిన అనంతరం ఆయన మహబూబ్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఓటర్లు ఎన్నికలను ఓట్ల పండగలా భావించి అందరూ కదిలిరావాలని కోరారు. దేశ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు, రాజ్యాంగ పునాదులు కాపాడేందుకు ఎవరికి ఓటు వేయాలో ఆలోచించాలని కోరారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత ప్రజలపై ఉన్నదని చెప్పారు.

బీజేపీ ఖాతాలో మహబూబ్‌నగర్

- బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ మాట్లాడుతూ దేశ ప్రజలంతా మోదీ వైపు చూస్తున్నారని, ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నికుట్రలు చేసినా, డబ్బులు పంపిణీ చేసినా ఓటర్లు మాత్రం దేశంలో మోదీ నాయకత్వమే ఉండాలని బలంగా నిర్ణయించుకున్నారని తెలిపారు. తెలంగాణలో ఎక్కడ చూసినా మోదీ నినాదం వినిపిస్తుందని రాష్ట్రంలో 12 సీట్లు గెలుచుకుంటామని చెప్పారు. అందులో ప్రధానంగా మహబూబ్‌నగర్ స్థానం ఉంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

తేడాను ప్రజలు గమనించాలి

- మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

మాజీ మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ గళం పార్లమెంట్‌లో లేవనెత్తాలన్నా, తెలంగాణ ఆత్మగౌరవం ఢిల్లీలో చాటాలన్నా గతంలో బీఆర్ఎస్ ఎంపీలే వినిపించేవారని అన్నారు. అందుకే బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉండేలా ఓటర్లు తీర్పు ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాక ముందు, తెలంగాణ వచ్చిన పదేళ్లు, ఇప్పుడు వచ్చిన ప్రభుత్వంలో వ్యత్యాసం ఏంటో ప్రజలు గమనించాలని కోరారు. తెలంగాణను అన్ని రకాలుగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు.



మహబూబ్‌నగర్‌లో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు



ఓటు వేయడానికి వీల్ ఛైర్‌లో వస్తున్న వృద్ధురాలు

దురుసుగా ప్రవర్తించిన కానిస్టేబుల్

- మేడిపూర్‌లోని పోలింగ్ బూత్ వద్ద యువకుడిపై చేయి చేసుకున్న వైనం - డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో క్షమాపణ చెప్పిన కానిస్టేబుల్

తాడూరు, మే 13 : ఎన్నికల విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ దురుసుగా ప్రవర్తించారు. ఓ యువకుడిపై చేయి చేసుకోవడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని మేడిపూర్ గ్రామంలో సోమవారం పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల విధులు నిర్వర్తించేందుకు కానిస్టేబుల్ రామచంద్రయ్య వచ్చారు. పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి గ్రామస్థులతో దురుసుగా ప్రవర్తిస్తూ వచ్చాడు. అటుగా వచ్చిన వారిని అసభ్య పదజాలంతో దూషించాడు. సాయంత్రం గ్రామానికి చెందిన సతీష్ (తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యుడు) అనే యువకుడు తన ఓటు హక్కును వినియోగించుకొని వస్తున్న క్రమంలో కానిస్టేబుల్ అసభ్యపదజాలంతో దూషించి చేయి చేసుకున్నాడు. దీంతో గ్రామస్థులందరూ ఒక్కసారిగా అసహనం వ్యక్తం చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో ఘటన స్థలానికి ఎస్ఐ మహేష్ చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్న క్రమంలోనే డీఎస్పీ శ్రీనివాస్‌యాదవ్ సైతం పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. జరిగిన సంఘటనను తెలుసుకున్న డీఎస్పీ కానిస్టేబుల్ దురుసుతనంతోనే ఈ పరిస్థితి నెలకొందని తెలుసుకొని అందరి సమక్షంలోనే యువకుడికి క్షమాపణ చెప్పించడంతో గొడవ సద్దుమణిగింది.

సీబీఎస్ఈ ఫలితాల్లో మౌంట్‌బాసిల్ ప్రభంజనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 13 : సీబీఎస్‌సీ బోర్డు సోమవారం విడుదల చేసిన పదోతరగతి ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం సమీపంలోని మౌంట్‌బాసిల్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఏ-1 గ్రేడ్ 32 మంది విద్యార్థులు, ఏ-2 గ్రేడ్ 74 , బీ-1 గ్రేడ్ 40, బీ-2 గ్రేడ్ 34మంది విద్యార్థులు సాధించారు. ఎస్. సాయి ప్రసూనాంబ 500 మార్కులకు గాను 491 మార్కులతో జిల్లామొదటి స్థానంలో నిలిచారు. ఆర్.కిషోర్ 489 మార్కులు సాధించి రెండవ స్థానంలో నిలిచారు. బినయు చందన మూడో స్థానంలో నిలిచిందని పాఠశాల యాజమాన్యం తెలిపింది. పాఠశాలలో విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారని హర్షంవ్యక్తం చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న మౌంట్ బాసిల్ పాఠశాల యాజమాన్యం

ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో 491 మార్కులు సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. కష్టపడి చదివా, పాఠశాల ఉపాధ్యాయులు ఎంతగానో ప్రోత్సహించారు. జేఈఈలో జాతీయస్థాయిలో మంచి ర్యాంక్ సాధించి ఇంజనీర్‌గా స్థిరపడాలన్నదే లక్ష్యం.

- సాయిప్రసూనాంబ, జిల్లా టాపర్

ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను పాఠశాల చైర్‌పర్సన్ చంద్రకళ వెంకటయ్య, కరస్పాండెంట్ పూజిత మోహన్‌రెడ్డి, డైరెక్టర్ శిరీష ప్రవీణ్, సుశాంత్ కృష్ణ, ప్రిన్సిపాల్ సురేష్, వైస్‌ప్రిన్సిపాల్ సౌమ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

సీబీఎస్‌సీ ఫలితాల్లో సమర్థ పాఠశాల విద్యార్థుల జయకేతనం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 13 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సమర్థ పాఠశాల విద్యార్థులు సోమవారం విడుదల అయిన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో జయకేతనం ఎగురవేశారు. వందశాతం ఫలితాలు సాధించి తమ సత్తాచాటారు. 30శాతం మంది విద్యార్థులు 90శాతం పైగా మార్కులు సాధించారు. 75శాతం విద్యార్థులు 80శాతానికిపైగా మార్కులు సాధించారు. మోక్షితాంజలి 480 మార్కులు (96శాతం), వంశికరామ్ 478 (96 శాతం), శ్రీధన్య 475 మార్కులు (95శాతం) సాధించారు. పాఠశాల ప్రిన్సి పాల్ శ్రీకాంత్ కోటా, డైరెక్టర్స్ నరేంద్రగుప్త, యాదయ్యగుప్త విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెల్దండ, మే 13 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలో చెర్కూర్ గేట్ సమీపంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం బోల్తాపడటంతో వ్యక్తికి గాయాలయ్యాయి. మండలంలోని రాచూరు గ్రామానికి చెందిన కిరణ్ తన ఓటుహక్కు వినియోగించుకొని వెళ్తుండగా వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కిరణ్‌కు గాయాలు కాగా స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఈవీఎంల తారుమారు

- ఆత్మకూరు పట్టణంలోని 207 బూత్‌లో అరగంట పాటు నిలిచిన పోలింగ్

- డీఎస్పీ కృష్ణ కిషోర్ చొరవతో యథావిధిగా పోలింగ్

ఆత్మకూరు,మే13: ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 207 బూత్‌లో ఈవీఎంలు తారుమారుగా ఏర్పాటు చేయడంతో ఓటర్లు గుర్తించి పోలింగ్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జాతీయ పార్టీలకు చెందిన గుర్తులను సూచించే ఈవీఎం మొదటి వరుసలో ఉంచాలనే ఆదేశాలు ఉన్నాయి. ఆ తరువాత స్వతంత్ర అభ్యర్థుల ఈవీఎంను రెండవ ఈవీఎంగా పరిగణించే పక్కలోనే ఉంచాలి అలా కాకుండా స్వతంత్ర అభ్యర్థుల ఈవీఎంను మొదటి వరుసలో ఉంచి జాతీయ పార్టీలకు చెందిన ఈవీఎంను రెండవ వరుసలో ఉంచారు. మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. మధ్యాహ్నం తరువాత ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు గుర్తించారు. ఈ విషయంపై ఆయా పార్టీల నాయకులకు ఓటర్లు తెలపడంతో నిర్లక్ష్యంగా ఉన్న పోలింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో డీఎస్పీ కృష్ణ కిషోర్ , సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ కలుగజేసుకుని ఎన్నికల కమిషన్‌కు సమాచారం అందించి యథావిధిగా పోలింగ్ కొనసాగించాలని ఆయా పార్టీల నాయకులకు సూచించడంతో సమస్య సద్దుమణిగింది.



ఆయా పార్టీల నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ కృష్ణ కిషోర్

పిడుగు పడి మిరప కుప్ప దగ్ధం

కేటీదొడ్డి, మే 13: పిడుగు పడి మిరపపండు కుప్ప దగ్ధమైంది. ఈ సంఘటన ఆదివారం అర్ధ రాత్రి గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలంలోని పాగుంట గ్రామంలో చోటుచేసుకుంది. సోమవారం గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పాగుంట గ్రామానికి చెందిన కురువ సిద్ధప్ప నాలుగు ఎకరాల పొలంలో సీడ్ మిరప (బ్యాగడ) పంటను సాగు చేశాడు. పంటను తెంపగా 45 క్వింటాళ్లకు పైగానే అయింది. పంటను మొత్తం పొలం దగ్గర నిలువ చేశాడు. రాత్రి ఉరు ములతో కూడిన పిడుగు నిల్వ చేసిన మిరప కుప్పపై పడడంతో పంట మొత్తం కాలిపోయింది. దాదాపు రూ.8,50,000 విలువ ఉంటుంది. చేతికి వచ్చిన పంటను నిల్వ చేయగా పిడుగు పడి మొత్తం మంటల్లో కాలి బూడిదయిందని ప్రభుత్వం బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



దగ్ధమవుతున్న మిరప

పిచ్చికుక్కదాడిలో పది మందికి గాయాలు

కోడేరు, మే 13 : పిచ్చికుక్కల దాడిలో పదిమందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని నర్సాయిపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ప్రకారం... గ్రామంలోని జడ్పీహెచ్ పాఠశాలలో పలువురు ఓటు వేయడానికి వెళ్తుండగా పిచ్చికుక్క తాళ్ల చంద్రమ్మ, చిట్టమ్మ, నాగేంద్రమ్మ, ఎదుట్ల లక్ష్మీ, కృష్ణ, వీరితోపాటు మరో ఐదు మందిని కరిచి గాయపర్చింది. చుట్టు పక్కల వారు చూసి వెంటనే చికిత్స నిమిత్తం బాధితులను కొల్లాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఊర్లో కుక్క బెడదను నివారించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నల్లమలలో వర్షం

దోమలపెంట, మే 13: నల్లమల అటవీ ప్రాంతం అమ్రాబాద్ మండలం వటువర్లపల్లి పరిసర ప్రాంతంలో సోమవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉక్కపోత నుంచి జనాలకు కొంత ఉపశమనం కలిగింది. రైతులు దుక్కులు దున్నుకునేందుకు అదును ఏర్పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వటువర్లపల్లిలో వర్షం కురిసిన అనంతరం ఇంద్ర ధనస్సు ఏర్పడంతో చూపరులను ఆకట్టుకుంది.

ఓటు కోసం అమెరికా టు ఇండియా



కుటుంబ సమేతంగా ఓటు వేసిన ఎన్నారై అమరేందర్‌రెడ్డి

ఉప్పునుంతల, మే 13: ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓ ఎన్నారై అమెరికా నుంచి కుటుంబ సమేతంగా ఇండియాకు వచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధి లోని ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన బొజ్జ అమరేందర్‌రెడ్డి ఉద్యోగరీత్యా అమెరికాలో ఉంటున్నారు. స్వదేశంలో జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేవారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు స్వగ్రామానికి రావడంతో పలువురికి ఆదర్శంగా నిలిచారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోస్గిరూరల్, మే13: ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో యువకుడు మృతి చెందిన సంఘటన కోస్గి శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వికారాబాద్‌జిల్లా దౌల్తాబాద్ మండలం బిచ్చాల గ్రామానికి చెందిన విష్ణుగౌడ్(19), భాస్కర్‌గౌడ్ ఇరువురు ద్విచక్రవాహనంపై కోస్గిలోని స్విమ్మింగ్‌పుల్‌వద్దకు వచ్చి ఈతకొట్టి తిరిగి స్వగ్రామానికి వెళ్తుడగా దౌల్తాబాద్ మార్గంలోని మైసమ్మగుడి సమీపంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో విష్ణుగౌడ్ మృతి చెందాడు. భాస్కర్‌కు గాయాలయ్యాయి. వెంటనే కోస్గి ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపారు.

బీజేపీ అభ్యర్థిపై పోలీసులకు ఫిర్యాదు

కోస్గిరూరల్, మే13: ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రంలోని అభ్యర్థి కండువా వేసుకొని వెళ్లవద్దని నిబంధనలు ఉన్నా బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి కండువా వేసుకొని వెల్లడంపై సీవిజిల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీజేపీ అభ్యర్థి డీకే అరుణ కోస్గిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అయితే పోలింగ్ కేంద్రంలోకి కండువా వేసుకొని వెల్లడంతో సీవిజిల్ బృందం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇస్తామని ఎస్సై శేఖర్‌గౌడ్ తెలిపారు.

పేరుకే 50 పడకల ఆసుపత్రి

- కానరాని కనీస వసతులు

- మందులు లేక రోగులకు తప్పని తిప్పలు

- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు

కోస్గి రూరల్, మే 13 : కోస్గి ప్రభుత్వాసుపత్రి పేరుకే 50 పడకల ఆసుపత్రి. రోగులు బారులు తీరుతున్నా.. అక్కడ కనీస వసతులు కరువయ్యాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆసుపత్రి నిర్మాణమే ఆరు సంవత్సరాలైంది. ఎన్నికల ముందు హడావుడిగా ఆసుపత్రిని ప్రారంభించినా సిబ్బంది కొరతతో పాటు మందులు సరఫరా కాక రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఏ మందులు అడిగిన తమ వద్ద లేవని, బయట తీసుకొని రావాలని వైద్యులు చీటి రాసి ఇస్తున్నారు. ప్రసవానికి మహిళలు వస్తే గైనిక్ డాక్టర్ ఎప్పుడు ఉంటారో ఎవరికి తెలియదు. విధుల్లో ఉన్న డాక్టర్లు నర్సుల ద్వారా డెలివరీలు చేస్తున్నారు. ఈ ఆసుపత్రి వైపు జిల్లా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ముఖ్యమంత్రి పర్యటన రోజు ఉన్న తాధికారులు వచ్చి పర్యవేక్షించి అపరిశుభ్రంగా ఉంటే ఎలా? ఆసుపత్రిలోని మరుగుదొడ్లు కూడా శుభ్రంగా ఉంచుకోరా? అంటూ మండిపడ్డారు. ఇక ఈ ఆసుపత్రి పరిస్థితే ఇలా ఉంటే పీహెచ్‌సీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.



కోస్గి ప్రభుత్వ ఆసుపత్రి

100పడకలకు అప్‌గ్రేడ్ చేస్తేనే..

కోస్గి ఆసుపత్రిని 100పడకలకు మార్చాలని అందుకు అధికారలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రపోజల్స్ పంపాలని ఆదేశాలు జారీచేసినట్లు సమాచారం. కోడంగల్ కాడ అధికారి వెంకట్‌రెడ్డి ఈవిషయంపై నివేదికలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్తిస్తాయిలో సిబ్బందిని నియమించి ప్రజలకు సేవలు అందించాలి. కాని గత ప్రభుత్వంలా కాకుండా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరువ చూపితే ఈ ఆసుపత్రి స్థితిగతులుమారుతాయి.

మందులు సరఫరా కావడం లేదు

ప్రభుత్వం నుంచి ఆసుపత్రికి మందులు సరఫరా కావడం లేదు. మేమేమి చేయలేము. ప్రభుత్వం సరఫరా చేస్తే అందిస్తాం.

- డాక్టర్ రంజిత్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఓట్ల పండుగ

పార్లమెంట్ ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ సోమవారం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ప్రశాంతంగా ముగిసింది. నూతనంగా ఓటు హక్కు వచ్చిన వారితో పాటు యువకులు, మహిళలతో పాటు వృద్ధులు సైతం ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. నడవలేని వారు కూడా కుటుంబసభ్యుల సహాయంతో కేంద్రాలకు వచ్చి ఓటు వేశారు. ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో జరిగిన పోలింగ్‌కు సంబంధించిన 'దృశ్యమాలిక' మీ కోసం...



నారాయణపేటలో ఓటు వేసేందుకు తాతను పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న బాలుడు



నారాయణపేటలో ఓటు ఓటు వేసి వస్తున్న వృద్ధురాలికి మెట్లు దిగేందుకు సాయం చేస్తున్న కానిస్టేబుల్



మహబూబ్‌నగర్ పట్టణంలో పోలింగ్ బూత్‌ల పరిశీలనకు బైక్‌పై వెళ్తున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



వనపర్తి జిల్లా రాజనగరంలో ఓటు హక్కు వినియోగించుకొని, వేలిపై సిరా గుర్తును చూపుతున్న వృద్ధులు



మక్తల్ : తొలిసారి ఓటు హక్కును వినియోగించుకున్న యువతి



వనపర్తి పట్టణంలో ఓటేసి పనికి వెళ్తున్న డెలివరీ బాయ్



కొండేరులో ఓటు వేసి, వేలిపై సిరా గుర్తు చూపుతున్న ఎన్ఆర్ఐ దంపతులు



వనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో తన మొదటి ఓటు వేసిన బాలింత. ఈ కేంద్రంలో ఈమెదే చివరి ఓటు కావడం విశేషం


నారాయణపేటలో ఓటు వేసి, వేలిపై సిరా గుర్తు చూపుతున్న వృద్ధులు



ఊట్కూరులో పోలింగ్ కేంద్రానికి ఆటోలో వచ్చిన వృద్ధురాలికి సాయం చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుడు



మహబూబ్‌నగర్ పట్టణంలోని మోడల్ బేసిక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసి సిరాగుర్తు చూపుతున్న దంపతులు



ధరూరు మండలంలోని బుడ్డందొడ్డిలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


వనపర్తి జిల్లా ఖిల్లాఘనపూర్‌లోఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు


ఊట్కూర్ మండలం, పెద్దజ్రటంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు, పురుషులు

పోలింగ్ బహిష్కరణ

- ఓటు హక్కు వినియోగించుకోని ఎదిర గ్రామస్థులు
- అమర్‌రాజా పరిశ్రమను తరలించాలని పట్టు
- ఉమ్మడి జిల్లాలో చెదురుముదురు సంఘటనలు

మహబూబ్‌నగర్ అర్బన్, మే 13 : అమర్‌రాజా పరిశ్రమను వ్యతిరేకిస్తూ మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని ఎదిర గ్రామస్థులు ఓటింగ్‌ను బహిష్కరించారు. గ్రామస్థులంతా ఓటింగ్‌కు దూరంగా ఉంటామని ముందుగా చెప్పిన ప్రకారం ఊరకంతా ఏకతాటిపై నిలిచి ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. కాగా ఎదిర గ్రామంలో 94,95,96 బూత్‌ల్లో హౌసింగ్ బోర్డ్‌కాలనీకి చెందిన 300 ఓట్లు ఉండగా వాళ్లను మాత్రం ఓటు వేసేందుకు గ్రామస్థులు అంగీకరించారు. తొలుత వాళ్లను కూడా ఓటు వేయొద్దని గ్రామస్థులు అడ్డుకోవడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని హౌసింగ్‌బోర్డ్‌కాలనీ ఓటర్లు ఓటువేసేందుకు గ్రామస్థులకు నచ్చచెప్పడంతో కొందరు ఓటేసి వెళ్లారు. మొత్తంగా ఇక్కడ 3299ఓట్లకు గాను 128 ఓట్లు మాత్రమే పోల య్యాయి. పోలింగ్ స్టేషన్ వద్ద కేంద్రబలగాలను మోహరించి ఎవరినీ లోపలికి అనుమతించకుండా అడ్డుకున్నారు.

అమరగిరి చెంచుగూడెంలో చెంచుల నిరసన

కొల్లాపూర్, మే 13 : కొల్లాపూర్ మండలం అమరగిరి గ్రామంలోని చెంచుగూడెంలో నాలుగు రోజుల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంది. సోమవారం విద్యుత్ సమస్య పరిష్కారమయ్యేంత వరకు తాము ఓటు వేయబోమని చెంచుగూడెం చెంచులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా చెంచులు మాట్లాడుతూ చెంచుగూ డెలో 70 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. నాలుగు రోజుల క్రితం ఈదురుగాలులకు చెంచుగూడెంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా సమస్యలు పరిష్కరించలేదన్నారు. తాము ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే గ్రామాలో నెలకొన్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో అధికారులు వెంటనే సిబ్బందిని పంపించి చెంచుగూడెంలో విద్యుత్ అంతరాయాన్ని పరిష్కరించడంతో చెంచులంతా ఓటు వేశారు.

మొరాయించిన ఈవీఎంలు

దోమలపెంట: అమ్రాబాద్ మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్ 226ఏ (వటువర్లపల్లి) రాయిలేటిపెంటలో ఈవీఎం మొరాయించడంతో ఉదయం 8గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా, 229బీ (దోమలపెంట) ఇంక్లాండ్ టన్నెల్‌లో (మత్స్యకారుల కాలనీ) ఈవీఎం మొరాయించడంతో ఉదయం 10 గంటలకు సరి చేసినప్పటికి ఓటర్లు మధ్యాహ్నం 12 గంటల తరువాత ఓటు వేసేందుకు వచ్చారు. ఎడమ పాతాళగంగ, దోమలపెంట ఇంక్లాండ్ టన్నెల్‌లో (మత్స్యకారుల కాలనీ) ఉన్న చాలా మందికి ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు కలిగి ఉండటంతో సుండిపెంటలో ఓటు వేసిన అనంతరం ఇక్కడ ఓటు వేసేందుకు ఆసక్తి చూపించడంతో ఇక్కడ కొంత అలస్యంగా ఓటింగ్ ప్రారంభం కావడం విశేషం. వటువర్లపల్లిలో 1149 ఓట్లకు గాను 705 ఓట్లు పోలయ్యాయి, రాయిలేటిపెంటలో 32కు, 28 ఓట్లు పోలయ్యాయి, ఇంక్లాండ్ టన్నెల్‌లో 45 ఓట్లలకు గాను 25 పోలయ్యాయి. ఎడమ పాతాలగంగలో 201 గాను 134 పోలయ్యాయి. ఈగలపెంటలో 299 గాను139 పోల్ కాగా, దోమలపెంటలో 966కు 398 ఓట్లు పోలయ్యాయి. సార్లపల్లిలో 430 గాను, 190 పోలయ్యాయి. కుడిచింతలబావిలో 280గాను 191 ఓట్లు పోలైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

కోడేరు : మండల కేంద్రంలోని 74వ పోలింగ్ బూత్‌లో దాదాపు ఉదయమే రెండు గంటలు ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ బూత్ దగ్గర ఓటర్లు గుమ్మి గూడి ఒక దశలో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు. మండలంలో ఓటర్లు తమ ఓటును వినియోగించు కున్నారు.

పైపాడు పోలింగ్ బూత్‌లో ఘర్షణ

వడ్డేపల్లి, : గద్వాల జిల్లా వడ్డేపల్లి మునిసిపాలిటీ గ్రామమైన పైపాడు 167బూత్‌లో ఈవీఎం మిషన్‌పై ఉన్న కారు గుర్తుపై పెన్ను మార్కర్ దిద్దడం వల్ల ఓటర్ల మధ్య గొడవ చోటు చేసుకున్నది. పోలింగ్ బూత్‌లో 1196 ఓటర్లు ఉండగా 848 ఓట్లు పోల్‌కాగా అనంతరం కొందరు ఓటర్లు గమనించి విషయాన్ని తెలియజేయడంతో పోలింగ్‌ను నిలిపివేశారు. స్థానిక పోలీసులు ఎస్పీ రితిరాజ్‌కి సమాచారం అందించడంతో ఆమె హుటాహుటిన పోలింగ్ బూత్‌కు చేరారు. పోలింగ్ కేంద్రం వద్ద గుమ్మిగూడిన ఓటర్ల చెదరగొట్టి పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం ఈవీఎంపై ఉన్న కారు గుర్తుపై ఉన్న మార్క్‌ను తుడిపివేసి యథావిధిగా ఎన్నికలు జరిపించారు. కాగా అంతకుముందు కారు గుర్తుకు పెన్నుమార్కర్‌తో దిద్దారని ఎంపీటీసీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి పోలీసులను ప్రశ్నించగా, వారు దురుసుగా మాట్లాడారని వాపోయారు. పోలీసులపై పైస్థాయి అధికారులకు, ఈసీకి ఫిర్యాదు చేస్తాన ఎంపీసీటీ తెలిపారు. కారు గుర్తుపై మార్కర్‌ను దిద్దారని ఓటర్లు అంటున్నారని విలేకర్లు ప్రశ్నించగా ఆ విషయం పోలింగ్ ఆఫీసర్‌కు తెలుసని ఎస్పీ అక్కడి నుంచి వెళ్లిపోయారు.


నిర్మానుష్యంగా ఉన్న ఎదిర గ్రామ వీధి


పైపాడు పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులతో మాట్లాడుతున్న గద్వాల ఎస్పీ రితిరాజ్


ఈవీఎంపై ఉన్న కారు గుర్తును మార్కర్‌తో దిద్దిన దృశ్యం


అమరగిరిలో గ్రామస్థులు నిరసన వ్యక్తం చేయడంతో విద్యుత్ సమస్యను పరిష్కరిస్తున్న సిబ్బంది


కోడేరు పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో వేచి చూస్తున్న ఓటర్లు


అమరగిరి చెంచుగూడెంలో ఓటు వేయకుండా నిరసన తెలుపుతున్న చెంచులు

కంపెనీ తరలించాలి



కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ తరలించాలన్నదే మా డిమాండ్. గతంలో రాజ్‌వీర్ కలర్ డయింగ్ ప్లాంట్ నుండి భూమి, నీరు,గాలి కాలుష్యాపై 20 సంవత్సరాలుగా అనర్థాల కు ఎదుర్కొంటున్నాం. పార్టీలకు అతీతంగా అందరు కలిసి పార్లమెంట్ ఎన్నిలను బహిష్కరించాం.

- బి.శివశంకర్, మాజీ కౌన్సిలర్

ఎవరూ స్పందించలేదు



కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ తరలించాలని 59 రోజులుగా దీక్షలు చేపడుతన్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం స్పందించ లేదు. గ్రామస్థు లంతా ఏకతాటిపై పార్లమెంట్ ఎన్నికలు బహిష్కంచాలి తీర్మానం చేసుకున్నాం. గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు.

- సుధా నర్సింహులు, ఎదిర

జలకాలుష్యంతో పంటలు పండవు



ఎదిర శివారులో బ్యాటరీ పరిశ్రమ ఏర్పాటు చేస్తే, జల, వాయుకాలుష్యం ఏర్పడుతుంది. తద్వారా భూగర్భ జలాలు కలుషితం అయ్యి పంటలు పండవు. చెరువులు, కుంటల్లోని నీరు విషతుల్యంగా మారే అవకాశం ఉంటుంది. వాయుకాలుష్యంతో శ్వాసకోశ వ్యాధుల పాలుకావాల్సి వస్తుంది. పోలింగ్‌లో పాల్గొనక పోవటం బాధగా ఉన్నప్పటికీ, భవిష్యత్తులో ప్రజలకు ఎదురయ్యే సమస్యల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం.

- అబ్దుల్‌హకీం, ఎదిర

ప్రాణాలతో చెలగాటం



కాలుష్యాన్ని వెదజల్లే అమరరాజా బ్యాటరీ కంపెనీ వస్తే మా ప్రాణాలతో చెలగాటమే. 59 రోజులు పార్టీలకు అతీతంగా దీక్షలు చేస్తున్నాం. కంపెనీ తరలే వరకు పోరాటం కొనసాగుతుంది. గ్రామపెద్దలు, యువకులు ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి ఎన్నికలు బహిష్కరించారు.

-భానుచందర్,ఎదిర

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని దేవినేనిపల్లి గ్రామంలో పోలింగ్ కేంద్రం దగ్గర ఒక వ్యక్తిపై మరొక వ్యక్తి దాడి చేశాడు. దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. దేవినేనిపల్లి గ్రామానికి చెందిన బీరయ్యపై అదే గ్రామానికి చెందిన శివ పాత కక్షలు మనసులో పెట్టుకుని పోలింగ్ కేంద్రం దగ్గర దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

శాంతియుత వాతావరణంలో ముగిసిన ఎన్నికలు

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 13: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలు వనపర్తి జిల్లాలో శాంతియుతంగా, పారదర్శకంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. సహకరించిన ఎన్నికల సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వనపర్తి జిల్లాలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం ఆరు గంటలకు ముగిసినట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా ఓటర్లు పారదర్శకంగా తమ ఓటును వినియోగించుకున్నందుకు అభినందనలు తెలిపారు. వనపర్తి జిల్లాలో సాయంత్రం ఆరు గంటల వరకు దాదాపు 66.56 శాతం ఓటింగ్ నమోదైందని, పూర్తి ఓటరు టర్నౌట్ మంగళవారం వరకు ప్రకటిస్తామని తెలిపారు. వనపర్తి జిల్లా ఓటర్లు ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉంచుతూ స్ఫూర్తిదాయకంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో తమ వంతు బాధ్యతలు నిర్వర్తించిన ప్రతీ ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి



ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వేలును చూపిస్తున్న శివసేనారెడ్డి

వనపర్తి రూరల్, మే 13: ప్రతీ ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తకాపు శివసేనారెడ్డి ఓటర్లను కోరారు. సోమవారం లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఆయన స్వగ్రామం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువతీ, యువకులు పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. మనం వేసే ఓటే మన భవిష్యత్ తరాలకు పునాది అవుతుందని అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగధనులు వారు తమ ప్రాణాలను అర్పించి స్వాతంత్ర పోరాటం చేసి సాధించుకున్న ఈ ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు వజ్రాయుధం లాంటిది అని అన్నారు. కార్యక్రమంలో పెద్దగూడెం గ్రామం ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రజస్వామ్యాన్ని కాపాడేందుకు ముందుకు వచ్చిన ఓటర్లు

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

పెబ్బేరు, మే 13 : ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం పెబ్బేరులో పోలింగ్ సరళిని పరిశీలించారు. అనంతరం మునిసిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ స్వగృహంలో మీడియాతో మాట్లాడారు. ఓటు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుందని నమ్మిన ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటును సద్వినియోగం చేసుకోవడం సంతోషం కలిగించిందన్నారు. భవిష్యత్తు కోసం విద్యావంతులైన వారు ఆలోచించి ఓటు వినియోగించుకున్నారని అన్నారు. అయితే అధికార పక్షం నాయకులు కక్షసాధింపులో భాగంగా పెబ్బేరులో బీఆర్ఎస్ కార్యకర్త భారతిని పోలీసులు అక్రమంగా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారని ఆరోపించారు. అలాగే నాగర్‌కర్నూల్, బిజినపల్లి తదితర ప్రాంతాలలో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీ నాయకులపై దాడులకు దిగారని వీటిపై రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము నాగర్‌కర్నూల్ పార్లమెంటు సీటును గెలువబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక

- పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



అమరచింతలో పోలింగ్ కేంద్రాల పరిశీలనకు వెళ్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అమరచింత, మే 13: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకలాంటి వారని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం అమరచింతలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని కాంగ్రెస్ నాయకుడు నాగరాజు గౌడ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కొద్దిసేపు కార్యకర్తలతో మాట్లాడారు. కార్యకర్తల సమిష్టి కృషితో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్లామని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీతో పాటు దేశవ్యాప్తంగా ఇండియా కూటమి గెలుపు ఖాయం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయూబ్ ఖాన్, మండల, పట్టణ అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, అరుణ్ కుమార్, నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, రవికాంత్, అంజిగౌడ్, శ్యామ్,తిరుమలేష్, విష్ణు, తౌఫిక్, తదితరులు పాల్గొన్నారు.

పోతన్‌పల్లిలో స్వల్ప ఘర్షణ

- కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మధ్య తోపులాట

- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన గొడవ

- మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో 70 శాతం పోలింగ్



పోతన్‌పల్లిలో గొడవపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలు

మహబూబ్‌నగర్‌రూరల్, మే 13 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగాయి. ప్రతీ గ్రామంలో ప్రజలు పోలింగ్ కేంద్రాలకు ఉదయం 7 గంటలకే ఓటు వేసేందుకు బారులు తీరారు. మండలంలోని మహబూబ్ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే 23 గ్రామాల్లో కలిపి సాయంత్రం 6 గంటల వరకు 70 శాతంగా పోలైనట్లు అధికారులు తెలిపారు. అన్ని గ్రామాల్లో సాయంత్రం 6 గంటల వరకు సాగిన ఎన్నికలో ఎలాంటి ఆలస్యం జరకుండా సజావుగా కొనసాగాయి.



వనపర్తి: మర్రికుంట ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న ఓటర్లు



వనపర్తి పట్టణంలో ఓటు వేసినట్లు వేలికి సిరాను చూపిస్తున్న మహిళలు



వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



ఖిల్లాఘణపురంలో ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు

ప్రశాంతంగా పోలింగ్

- ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు, అధికారులు

- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు

- అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలు

- వెంటనే సరిచేసిన అధికారులు

- ఓటింగ్ సరళిని పరిశీలించిన నాయకులు, అధికారులు





పెద్దమందడి మండలం మనిగిల్ల ప్రభుత్వ పాఠశాల వద్ద ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు

ఖిల్లాఘణపురం, మే 13: మండలంలోని 44 పోలింగ్ బూత్‌లలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని సోలీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఎస్పీ రక్షిత కె.మూర్తి పరిశీలించి భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. సల్కెలాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, మానాజీపేట మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని జడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. ప్రశాంతంగా పోలింగ్‌ను నిర్వహించిన అధికారులను అభినందించారు. పర్వతాపూర్‌లో పోలింగ్ ముగిసే పది నిమిషాలకు ముందు ఈవీఎం మిషన్ టెక్నికల్ సమస్య రావడంతో కొత్త ఈవీఎం మిషన్ ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ 29లో గిరిజన మోడల్ పోలింగ్ కేంద్రంలో గిరిజనులు ప్రత్యేక సంప్రదాయ దుస్తులలో ఓటు వేయడానికి ఆసక్తి కనబరిచారు. పట్టణాల్లో స్థిపడ్డ ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోవడానికి రాక పోవడంతో తండాల్లోని పోలింగ్ కేంద్రాలు వెలవెల బోయాయి. మండలంలోని పోలింగ్ స్టేషన్‌లలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెబ్బేరులో..

పెబ్బేరు: పెబ్బేరు పట్టణంలో సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల అధికారులు, పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టణంలో మొత్తం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పెబ్బేరు పరిధిలో 10, చెలిమిళ్ల, కిష్టారెడ్డిలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని 198వ బూత్‌ను బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. 204, 206 పోలింగ్ బూత్‌లను కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి పరిశీలించి అక్కడి కాంగ్రెస్ నాయకులతో ఓటింగ్ సరళి తెలుసుకున్నారు. 201 పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే మేఘారెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి పోలింగ్ సరళిని పరిశీలించారు. యూపీఎస్ వద్ద ఏర్పాటు చేసిన 200 పోలింగ్ బూత్‌లో ఉదయం ఈవీఎం సమస్య రావడంతో మరోకటి ఏర్పాటు చేశారు.

వనపర్తి రూరల్‌లో..

వనపర్తి రూరల్ : వనపర్తి మండలంలోని పెద్దగూడెం, కడుకుంట్ల, మెంటపల్లి, సవాయిగూడెం, నాచహళ్లి తదితర గ్రామాల్లో సోమవారం లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమై సాయంత్రం ఆరు గంటలకు ముగిసింది. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటు వినియోగించుకునేందుకు వృద్ధులకు వీల్ చైర్‌లను అందుబాటులో ఉంచారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు క్యూలో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రేవల్లిలో..

రేవల్లి : మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రేవల్లిలో ఓటింగ్ సరళిని పరిశీలించారు. కార్యకర్తలను కలిసి మాట్లాడారు. అదే విధంగా రేవల్లి మండల కేంద్రంలో ఒక వ్యక్తి ఓటు వేయడానికి వరుసలో నిలబడి కళ్లు తిరిగి పడిపోయాడు. అధికారులు వెంటనే గమనించి అతనికి ప్రథమ చికిత్స చేశారు.

వీపనగండ్లలో..

వీపనగండ్ల : మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 14 గ్రామ పంచాయతీలో 29 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 23,938 మంది ఓటర్లకు గాను 15,664 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 65 శాతం ఓటింగ్ నమోదైనట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. వల్లభాపురం తండాలో 141/ఏ పోలింగ్ కేంద్రంలో 30 నిమిషాల పాటు ఈవీఎం మోరాయించింది.

కొత్తకోటలో..

కొత్తకోట : మండలంలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. మండల వ్యాప్తంగా 71.55 శాతం పోలింగ్ నమోదు అయింది. అక్కడక్కడా మొరాయించిన ఈవీఎంలను అధికారులు వెంటనే మరమ్మతులు చేసి పోలింగ్‌కు సహరించారు. పోలింగ్ కేంద్రాలను బెలూన్‌లతో అలంకరించారు. ఉదయం నుంచే ఓటర్లు ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. కొత్తకోట ఉర్దూ మీడియం పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం సమీపంలో ప్రచారం చేస్తున్న నాయకులను పోలీసులు చెదరగొట్టారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, రావుల చంద్ర శేఖర్‌రెడ్డి వారి స్వగ్రామాల్లో ఓటు హక్కు వినియోగించు కున్నారు. కనిమెట్టలో దివ్యాంగులను ఓటు వేయడానికి దివ్యాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌శెట్టి మూడు చక్రాల సైకిల్‌పై తీసుకెళ్లారు.

మదనాపురంలో..

మదనాపురం : పార్లమెంటు ఎన్నికలు మండలంలో సోమవారం ప్రశాంతంగా ముగిసినట్లు తహసీల్దార్ అబ్రహం లింకన్ తెలిపారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయం నుంచి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఉదయం 11 గంటల వరకు పోలింగ్ జోరుగా సాగింది. తరువాత రెండు గంటల పాటు నెమ్మదిగా సాగినా ఆ తరువాత మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో 75.4 శాతం పోలింగ్ నమోదు అయింది. మండల కేంద్రంలోని పోలింగ్ బూతులను ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఎస్పీ రక్షితమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.

గోపాల్‌పేటలో..

గోపాల్‌పేట : ఎంపీ ఎన్నికలు సోమవారం మండలంలో ప్రశాంతంగా నిర్వహించారు. మండల వ్యాప్తంగా 64శాతం ఓటింగ్ నమోదైనట్లు ఎంపీడీవో శంకర్‌నాయక్ తెలిపారు. 264బూత్‌లో ఈవీఎం కాస్త మోరాయించింది. దీంతో ఓటర్లు ఇబ్బందికి గురయ్యారు. అధికారులు తక్షణమే వేరే ఈవీఎం ఏర్పాటు చేయడంతో పోలింగ్ సజవుగా సాగింది. మండల కేంద్రంలో 5,529 ఓట్ల గాను 3,755 ఓట్ల పోలైనట్లు అధికారులు తెలిపారు. మండలంలోని జయన్న తిరుమలపూర్ గ్రామంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యాక్షుడు చిన్నారెడ్డి ఓటు హక్కును వినియోగిం చుకున్నారు.

పాన్‌గల్‌లో..

పాన్‌గల్ : పార్లమెంట్ ఎన్నికలు సోమవారం మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయం ఏడు గంటల నుంచి ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. మహమ్మదాపూర్ 114 పోలింగ్ బూత్‌లో కొద్దిసేపు ఈవీఎం మోరాయించడంతో అధికారులు వెంటనే సరిచేసి పోలింగ్ కొనసాగించారు. కేతేపల్లి గ్రామంలో ఓటర్ స్లిప్పులు పంపిని చేయలేదని గ్రామస్థులు ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో కోటేశ్వర్, డీటీ అశోక్‌కుమార్‌లు పరిశీలించారు. సాయంకాలం పోలింగ్ ముగిసే సమయానికి మండలంలో 64.9శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలో చిన్నపాటి వాగ్వివాదాలు మినహాయిస్తే అన్ని పోలింగ్ కేంద్రాలలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం రాత్రి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడిన కారణంగా ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆత్మకూరు మండలంలో 31,011 మంది ఓటర్లు ఉండగా వారికి అనుగుణంగా 35 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈ పార్లమెంట్ ఎన్నికలలో రెండు శాతం ఎక్కువగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పరిశీలకులు చెబుతున్నారు.

అమరచింతలో..

అమరచింత : పార్లమెంట్ ఎన్నికలు సోమవారం అమరచింత మండలంలో ప్రశాంత వాతావరణం మధ్య కొనసాగాయి. మండలంలో 26 పోలింగ్ బూత్‌లో 22,946 మంది ఓటర్లు ఉన్నారు. ఐదు గంటల వరకు 16,210 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, అడిషనల్ ఎస్పీ రామదాస్ తేజావత్, సీఐలు శివకుమార్, ప్రభాకర్‌రెడ్డిలు పరిశీలించారు.



చిట్యాల ప్రభుత్వ పాఠశాల వద్ద ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు



పెద్దమందడి ప్రభుత్వ పాఠశాల వద్ద ఓటు వేయడానికి క్యూలో ఉన్న ఓటర్లు



అమరచింత పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్



వనపర్తిలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

తిరుగు ప్రయాణంలో ఎన్నికల సిబ్బంది



ఎన్నికల సామగ్రితో చిట్యాల వ్యవసాయ మార్కెట్ గోదాము వద్ద ఎన్నికల సిబ్బంది

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే13: ఎన్నికల సిబ్బంది సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు ప్రశాంతంగా ఎన్నికలు ముగించుకుని తిరుగుముఖం అయ్యారు. ఓట్లు నిక్షిప్తమైన ఈవీఎంలను వీవీ ప్యాట్లను ఇతర ఎన్నికల సామాగ్రిని కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తిరిగి చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాముకు చేర్చారు. ఎన్నికల ఉన్నతాధికారుల సమక్షంలో ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా అప్పజెప్పి తమ విధులను ముగించారు.



ఎన్నికల సామగ్రితో చిట్యాల వ్యవసాయ మార్కెట్ గోదాముకు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

బీజేపీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర

- పంజాబ్‌లో కాంగ్రెస్, అకాలీదళ్‌తో ప్రజలు విసిగిపోయారు

- బీజేపీ పంజాబ్, హర్యానా రాష్ట్రాల సంఘటన్ కార్యదర్శి మంత్రి శ్రీనివాస్



అమరచింతలో బీజేపీ నాయకులతో కలిసి సిరా చుక్కను చూపిస్తున్న మంత్రి శ్రీనివాస్

అమరచింత, మే 13: దేశవ్యాప్తంగా బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొన్ని దుష్టశక్తులు పార్టీని నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నాయని ఆ పార్టీ పంజాబ్, హర్యానా రాష్ట్రాల సంఘటన్ కార్యదర్శి మంత్రి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన సొంత గ్రామమైన అమరచింతకు వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి మాట్లాడుతూ... మూడోసారి బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. మూడోసారి మోదీ ప్రధాని కావడాన్ని ఎవరూ ఆపలేరని ఆయన అన్నారు. ఢిల్లీలో చేస్తున్న రైతు ఉద్యమం ఓ కిరాయి ఉద్యమం ఆయన అన్నారు. కొంతమంది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి కిరాయి ఉద్యమాన్ని నడిపిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అకాలీదల్ పార్టీల నుంచి ప్రజలు విసిగిపోయారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేర్వ రాజు, క్యామ భాస్కర్, వెంకటేశ్వర్లు, మరాఠీ అశోక్, నరాల నారాయణ, కౌన్సిలర్లు ఉషారాణి, లావణ్య, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, సిద్ధి రాములు, రాజేందర్ రెడ్డి, సురేష్, అంజి, అనిల్, భరత్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మృతి

- అంత్యక్రియల్లో పాల్గొన్న చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి శివసేనారెడ్డి

వనపర్తి టౌన్, మే 13: కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బండారు రాధాకృష్ణ అనారోగ్యంతో మృతి చెందారు. వనపర్తి పట్టణంలోని 13వ వార్డు కౌన్సిలర్ రాధాకృష్ణ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు రావుల చంద్రశేఖర్‌రెడ్డిలు బండారు రాధాకృష్ణ నివాసానికి వెళ్లి మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం జరిగిన అంత్యక్రియల్లో చిన్నారెడ్డి, శివసేనారెడ్డి, మేఘారెడ్డి పాల్గొన్నారు. మేఘారెడ్డి పాడె మోశారు. అదేవిధంగా వనపర్తి మండలంలోని కుడుకుంట్లలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త ఆంజనేయులు సోమవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మృతి చెందారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్ల వెంకటేష్, చెన్నరాములు, జానకిరాములు, రవిప్రసాద్, గద్దం వినోద్, కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

నిర్మానుష్యం..

- ఎన్నికల సందర్భంగా మూతపడ్డ వ్యాపార సముదాయాలు

- జనాలు లేక వెలవెలబోయిన ప్రధాన చౌరస్తాలు



దుకాణాలు మూసి ఉంచడంతో నిర్మానుష్యంగా మారిన వనపర్తి న్యూ బస్టాండ్ ప్రాంతం

వనపర్తి టౌన్, మే 13: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా కేంద్రం నిర్మాణుష్యమైంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా జిల్లా కేంద్రంలో వ్యాపార సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, కూరగాయల మార్కెట్ వంటి తదితర ప్రదేశాలు నిర్మాణుష్యంగా దర్శనమిచ్చాయి. నిత్యం వేల సంఖ్యలో జనాలతో రద్దీగా ఉండే ప్రధాన చౌరస్తాలు రాజీవ్ చౌక్, అంబేడ్కర్ చౌక్, గాంధీ చౌక్, న్యూ బస్టాండ్, కమాన్ చౌరస్తా, శంకర్‌గంజ్, న్యూ బస్టాండ్ రోడ్, డిపో రోడ్ వంటి ప్రధాన చౌరస్తాలు జనాలు లేక వెలవెలబోయాయి. ఎన్నికల సందర్భంగా సోమవారం ఉదయం నుంచే వ్యాపార సముదాయాలు స్వచ్ఛందంగా మూసివేశారు.